

ఎక్సైజ్ కార్యాలయంలో వేలం పాట

దోమకొండ, ఆగస్టు 1: మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో నేడు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కేసులలో సీజ్ చేయబడిన రెండు బైక్‌లు, ఒక సైకిల్ వేలానికి ఉన్నాయని, బైక్స్ విలువ రూ. 3 వేలు, సైకిల్ విలువ రూ. 2వేలు ఉంటుందన్నారు. కావున శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంపాటలో ఆసక్తిగల వారు పాల్గొనాలని తెలిపారు.



జోరందుకున్న.. వరి నాట్లు!

- జిల్లాలో ఇప్పటికే 70 శాతం మేర పంటలు
- లక్ష్యానికి చేరువలో పంటల సాగు
- వరి, మొక్కజొన్న, పత్తి, సోయాల వైపే రైతుల మొగ్గు
- జిల్లా వ్యాప్తంగా 2.90 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- ఇందులో అత్యధికంగా వరి 1.29లక్షల ఎకరాలు
- ఈనెల చివరికల్లా మరింత వరి సాగయ్యే అవకాశం
- జిల్లాలో కురుస్తున్న వర్షాలు.. చెరువులు, ప్రాజెక్టుల్లోకి చేరుతున్న వరద
- వానాకాలం సాగుపై ఆశలు సజీవం

కామారెడ్డి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో వరి నాట్లు జోరందుకున్నాయి. ఇప్పటికే పంటల సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. గత 20 రోజుల కిందట వరి సాగు చేయాలా వద్ద అనే దానిపై సందిగ్ధంలో ఉన్న రైతన్నలు కురుస్తున్న ముసురు వర్షాలతో ఆశలు రేకెత్తిస్తున్నాయి. రైతులు పంటలను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. రైతులు సాధారణ విస్తీర్ణంలో 70 శాతం మేర పంటలు వేశారు. ఈనెల చివరికల్లా మిగితా 30 శాతం వరకు పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత సీజన్ మాదిరిగానే ఈ సీజన్ సైతం కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రధాన ప్రాజెక్టులతో పాటు చెరువుల్లోకి స్వల్పంగా వరద వచ్చి చేరుతుంది. పలు ప్రాంతాల్లోని వాగులు జలకళను సంతరించుకుంటున్నాయి. వర్షపాతం సైతం సాధారణం కంటే ఎక్కువే నమోదైంది. దీంతో వానాకాలం సాగుపై ఆశలు సజీవంగా మారాయి.

జిల్లాలో పంటల సాగు ఇలా..

జిల్లాలో వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు రైతులు సుమారు 2.90 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లా సాధారణ సాగు 5.14 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు సుమారు 70 శాతం మేర పంటలు సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, సోయా, పప్పు దినుసు పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలంలో అత్యధికంగా వరి పంట సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 3.13 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 1.29 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి.

ఈ నెల చివరికల్లా మరిన్ని వరి నాట్లు పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న 29,927 ఎకరాల్లో సాగైంది. సోయాబీన్ 79,424 ఎకరాల్లో, పత్తి 24,311, కందులు 16,425, మినుములు 4,920, పెసర్లు 4,596, జొన్న 30 ఎకరాలల్లో పంటలు సాగయ్యాయి.

వలస కూలీలతో నాట్లు

గత రెండు సంవత్సరాలుగా వానాకాలం సీజన్‌లో జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి వెతుకుంటూ వరి నాట్లకు కూలీలు వలస వస్తున్నారు. జిల్లాలోని బాన్సువాడ, నస్రూల్లాబాద్, బీర్కూర్, బిచ్కుంద, ఎల్లారెడ్డి, లింగంపేట, నిజాంసాగర్, పిట్లం, కామారెడ్డి, మాచారెడ్డి, భిక్కనూర్ ప్రాంతాల్లో వలస కూలీలు వరి నాట్లు వేస్తున్నారు. ఇక్కడి మధ్యవర్తులు కొందరు బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు ఎకరాన రూ.5500ల నుంచి రూ.6500ల వరకు వలస కూలీలకు చెల్లిస్తున్నారు. స్థానికంగా ఉండే కూలీలకు కూడా డిమాండ్ పెరిగింది. గతంలో రూ.300ల నుంచి రూ.400ల వరకు ఉండే కూలి ప్రస్తుతం రూ.500ల నుంచి రూ.600ల వరకు చెల్లిస్తున్నారు. మగ కూలీలకు రూ.700ల నుంచి రూ.800ల వరకు ఇస్తున్నారు. దీంతో పాటు జిల్లాకు సరిహద్దులో ఉన్న సిద్దిపేట, సిరిసిల్ల, మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచి పొరుగు గ్రామాలకు వరి నాట్లు వచ్చి కూలీలకు రవాణా చార్జీలు అదనంగా చెల్లిస్తున్నారు. రైతులు మాత్రం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలతో నాట్లలో వేగం పెరిగిందని చెబుతున్నారు.

యూరియాకు డిమాండ్

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో రైతులు వరి పంట సాగుకు మొగ్గు చూపుతుండడంతో యూరియాకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో రైతులు యూరియాను తీసుకెళ్లడానికి ఆయా ప్రాంతాల్లో ప్రాథమిక సహకార కేంద్రాలు, డీసీఎంఎస్‌లు, ప్రైవేట్ డీలర్ల వద్దకు వస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగానే అధికారులు యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడ డిమాండ్ ఉందో గమనిస్తు యూరియాను సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అదనంగా యూరియాను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయాధికారులు చర్యలు చేపడుతున్నారు.

సాధారణ వర్షపాతం నమోదు

పక్షం రోజుల కిందట జిల్లాలో లోటు వర్షపాతం ఉంటూ వచ్చింది. అయితే గత 10 రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వర్షపాతం లోటు నుంచి సాధారణ వర్షపాతానికి చేరింది. మద్నూర్, బిచ్కుంద, నస్రూల్లాబాద్, బాన్సువాడ, సదాశివనగర్, తాడ్వాయి, డోంగ్లి మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, లింగంపేట, గాంధారి, రాజంపేట, భిక్కనూరు, కామారెడ్డి, రామారెడ్డి, మాచారెడ్డి, పల్వంచ మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా గత జూన్ నుంచి ఇప్పటి వరకు 434.2 మి.మీల వర్షం కురిసింది. గత ఏడాది ఇదే సమయానికి 608.7 మి.మీల వర్షపాతం నమోదైంది.

ప్రాజెక్టులు, చెరువుల్లోకి స్వల్పంగా వరద

జిల్లాలో రైతులు ఎక్కువగా వర్షాలు, చెరువులు, ప్రాజెక్టులపైనే ఆధారపడి పంటలను సాగు చేస్తుంటారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులు, చెరువుల్లోకి స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.796 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పోచారం ప్రాజెక్టులోకి వరద వస్తోంది. ఈ ప్రాజెక్టులోకి 1881 ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.840 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది.

త్వరలో పర్యాటక కేంద్రంగా నాగన్న బావి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



లింగంపేటలో నాగన్న బావి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

లింగంపేట, ఆగస్టు 1: మండల కేంద్రంలోని ప్రాచీన కట్టడమైన నాగన్న బావిని త్వరలోనే పర్యాటక కేంద్రంగా తయారు చేసి ప్రారంభిస్తామని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఆయన గురువారం లింగంపేట మండల కేంద్రంలోని ప్రాచీన కట్టడం నాగన్న బావి పునరుద్ధరణ పనులను ఇన్ఫోసిస్ వైస్ ప్రసిడెంట్ కల్పనా రమేష్‌తో కలిసి పరిశీలించారు. ప్రాచీన కట్టడాలను కాపాడడానికి ఇన్ఫోసిస్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఆయన తెలిపారు. బావి వద్దకు పర్యాటకులు వచ్చేందుకు ఉపాధి హామీ పథకంలో ఫార్మేషన్ రోడ్డును తొందరగా వేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటాలని సూచించారు. బావి వద్ద నాలుగు హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. బావి చుట్టు నిర్మిస్తున్న రక్షణ కంచెను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ గిరి, కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌లతో పాటు అధికారులు ఉన్నారు.

నిజాంసాగర్ పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలో గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పర్యటించారు. ముందుగా నిజాంసాగర్ పీహెచ్‌సీని పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించగా సీనియర్ అసిస్టెంట్ సుభాష్ జూలై 27 నుంచి ఆగస్టు 1 వరకు విధులకు హాజరు కానందున అతడిని సస్పెండ్ చేయాలని జిల్లా అధికారి చంద్రశేఖర్‌ను ఆదేశించారు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్ నవ్యశ్రీని సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఇన్ పేషంట్ వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన అన్నారు. ఆస్పత్రిలో చెట్లను పెంచితే స్వచ్ఛమైన గాలి ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం మండలంలోని వడ్డేపల్లి శివారులో పంటలను పరిశీలించారు. పంటల నమోదును జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణిని భాగ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వేసే పంటల వివరాలను తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రైతులకు త్వరగా రుణమాఫీ జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. కాగా నిజాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. రూ. 4లక్షల 82 వేలతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తయిన స్లాబు మరమ్మతులు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వండే విధానాన్ని పరిశీలించారు. 9వ తరగతి గదిలో వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం మండలంలోని గోర్గల్ గ్రామ పరిధిలోని అటవీశాఖ వారు ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఆయకట్టు కింద బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో ఒక లక్షా 15వేల ఆయకట్టు ఉందన్నారు. నీటిని వదిలేటప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని ఈఈ సామ్యుల్‌ను కలెక్టర్ ఆదేశించారు. నిజాంసాగర్‌ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాన్ని పరిశీలించి ప్రభుత్వ పథకాలకు సంబంధించి, దరఖాస్తులను వేగంగా ప్రజలకు లబ్ధి చేకూరేలా చేయాలని ఎంపీడీవో గంగాధర్‌కు సూచించారు. అనంతరం పీహెచ్‌సీని పరిశీలించారు. కార్యాలయంలో హాజరు పట్టికలను పరిశీలించారు. ఉపాధిహామీ జాబ్ కార్డులకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక అధికారులు ఉన్నారు.



నిజాంసాగర్ పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్



వడ్డేపల్లి శివారులో పత్తి పంటను పరిశీలిస్తూ..



జోరుగా.. పేకాట!

- బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్‌ల్లో జోరుగా పేకాట
- మామూళ్ల మత్తులో అధికారులు

నసురుల్లాబాద్, ఆగస్టు 1: జిల్లాలోని నసురుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ మండలాల్లో పేకాటకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పేకాటరాయుళ్లకు నసురుల్లాబాద్ మండలంలో పేకాట ఆడితే ఎలాంటి ఢోకా ఉండదని తమ దిన చర్యకు ఆటంకాలు రావని ఒక భరోసా. ప్రతినిత్యం నసురుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో అటవీ ప్రాంతాలను ఆసరాగా చేసుకుని అడ్డాలుగా మారుస్తూ తమ ఆటను పేకాటరాయుళ్లు దర్జాగా కొనసాగిస్తున్నారు. పేకాటరాయుళ్లకు ఫోన్లు చేసి మరీ రప్పించుకుని పేకాట కేంద్రాలను నిర్వహిస్తున్న నిర్వాహకులు పత్తలాటను అలవోకగా ఆడిస్తున్నట్లు సమాచారం. సుమారు ఒక్క రోజు లక్షల రూపాయల్లో టర్నోవర్ చేస్తూ పత్తలాడే వారి జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారు. దీనిలో ఆట ఆడించే వారు రోజుకు 20 నుంచి 30 వేల రూపాయలు కేటీ కిరాయి తీస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. దీని కోసం నెలనెలా పోలీసులకు మాముళ్లు ముట్ట చెబుతున్నారని నసురుల్లాబాద్ మండలంలో ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఒక తరహాలో విజిలెన్స్ టాస్క్‌ఫోర్సు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేసేందుకు వస్తున్నారని తెలిసిన మరుక్షణమే అందరూ బెదురు లేకుండా తమకేం కాదు అన్నట్లుగా దర్జాగా పత్తలాటను కొనసాగిస్తున్నారు. ఇది ఏమిటని ఆరా తీస్తే ఇంటలిజెన్స్ టాస్క్‌ఫోర్సు విజిలెన్స్ పోలీసులకు స్థానిక పోలీసులే తప్పుదోవ పట్టిస్తూ పేకాట స్థావరాలను కంటికి రెప్పల కాపాడుకుంటున్నారని విమర్శలు మండలాల్లో చక్కర్లు కొడుతున్నాయి. గతంలో మండలంలో ఇలాంటి తతంగమే కొనసాగిందని, దీంతో అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' పత్రిక 'అడవిలో పేకాట' అనే శీర్షికన వార్త ప్రచురితమైతే అప్పటి ఎస్పీ స్పందించి స్థానిక పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసి పేకాట నివారణపై ఉక్కుపాదం మోపారు. ప్రస్తుతం మండలంలో మళ్లీ పాత రోజులే కొనసాగుతున్నట్లుగా పేకాట జోరు అందుకుంది. పేకాట ఆడటానికి వస్తున్న వారి కుటుంబాలు తమ బతుకులు ఛిద్రం అవుతున్నాయని, తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సైతం మండలంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పేకాట స్థావరాలను నడిపిస్తున్న పేకాట రాయుళ్ల ఆటకట్టించి పత్తలాటని జాడ లేకుండా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు మొర పెట్టుకుంటున్నారు.



పేకాట ఆడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు

- సత్యనారాయణగౌడ్, బాన్సువాడ రూరల్ సీఐ

నసురుల్లాబాద్ మండలంలో పేకాట ఆడుతున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. నసురుల్లాబాద్ మండ లంలో పేకాట ఆడుతున్నట్లు తమకు సమాచారం లేదని, అలాంటి సమాచారం ఎవరైనా ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.



బాల్కొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రజీయొద్దీన్

ముప్కాల్, ఆగస్టు 1: బాల్కొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రజీయొద్దీన్ అస్లం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ప్రిన్సిపాల్ అర్గుల చిన్నయ్య అయిలాపూర్ జూనియర్ కాలేజీకి బదిలీపై వెళ్లగా రజీయొద్దీన్ అస్లం బాధ్యతలు స్వీకరించారు.

డీఎంహెచ్‌వోగా రాజశ్రీ బాధ్యతల స్వీకరణ

పెద్దబజార్, ఆగస్టు 1: జిల్లా వైద్యశాఖ అధికారిగా డాక్టర్ రాజశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ ఆర్మూర్‌కు బదిలీ అయ్యారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ హైదరాబాద్‌లోని చార్మినార్ జోన్ నుంచి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి రాజశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీరాజ్ డీఈగా కిషన్‌నాయక్

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 1: ఆర్మూర్ డివిజన్ పంచాయతీరాజ్ డీఈగా కిషన్‌నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవలి వరకు డీఈగా పని చేసిన బాబురాం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఇందల్వాయిలో పీఆర్‌ఏఈగా పని చేస్తున్న కిషన్‌నాయక్ పదోన్నతి పొంది ఆర్మూర్ పంచాయతీరాజ్ డీఈగా బాధ్యతలు స్వీకరించారు. డీఈగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌నాయక్‌ను ఈఈ బావన్న, రాజేశ్వర్‌లు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఏఈలు నితిష్, రాజ్‌కుమార్, మేఘన, ఇంద్రసేన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 1: వాక్ ఫర్ ఇన్నోవేషన్ ఇంటింటా ఇన్నోవేటర్ పేరు మీద కొత్త ఆలోచనలు రేకెత్తించేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ పీఆర్ మేనేజర్ వాణి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఆవిష్కరణలకు, ఆలోచనలు రేకెత్తించే విధంగా అన్ని జిల్లాల నుంచి ఈ దరఖాస్తులను ఆగస్టు 3 వరకు స్వీకరిస్తున్నామని తెలిపారు. కొత్త ఆలోచనలతో పంపిస్తే ఆగస్టు 15న ప్రదర్శన ఏర్పాటు చేస్తామని వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. జిల్లా నుంచి ఎక్కువ మంది తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్‌కు గడువులోపు పంపించాలని ఆమె కోరారు.

కేజీబీవీలో సహాయ వంట మనిషి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూరు, ఆగస్టు 1: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న సహాయక వంట మనిషి (అసిస్టెంట్ కుక్) పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి శ్యామల తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18-40 ఏళ్ల వయస్సు గల మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 2నుంచి 4వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్, ఆగస్టు 1: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఆగస్టు 15 నుంచి ద్విచక్ర వాహనదారులందరు హెల్మెట్ ధరించాలని అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా తదితర ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు రాంగ్‌రూట్‌లో వాహనాలను నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, పట్టణ సీఐ వీరయ్య పాల్గొన్నారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

▸ భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్థభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంత కంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

▸ సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

▸ జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

▸ 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

▸ ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

▸ జూలై 13న గాజాలో అంతం చేశాం

▸ ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

▸ ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్లు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

▸ వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

▸ బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు


▸ లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రెటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.









పేదవాడికి సేవ చేయడమే లక్ష్యం

● ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ● ఘనంగా జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 1 : నియోజకవర్గంలో ఉన్న ప్రతిపేదవారికి సేవచేయడమే లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. తాను అసెంబ్లీలో కూడా నియోజకవర్గంలో ఉన్న సమస్యల పట్ల లేవనెత్తానన్నారు. గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు జన్మదినం సందర్భంగా కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేసి ఒకరిరొకరు స్వీట్లు పంచుకుని వేడుకలను ఘనం గా నిర్వహించారు. ఆయన పుట్టిన రోజు పాట సీడీని ఆవిష్కరించారు. అంతకు ముందు తలసేమియా సికిల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయి బాబా, పట్టణ అధ్యక్షులు వినోద్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంక ట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్:మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు కేకులు కట్‌చేస్తు మిఠాయిలు పంచుకుని సంబరాలు నిర్వహించారు.

న్యాయ కళాశాలలో అవగాహన సదస్సు

డిచ్‌పల్లి, ఆగస్టు 1 : తెలంగాణ వర్సిటీలో న్యాయ కళాశాలలో గురువారం చట్టాలు, డ్రగ్స్ నివారణ, న్యాయ కళాశాల విద్యార్థుల పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఎల్లోసన అధ్యక్షతన వహించారు. బెటాలియన్ ఏఆర్ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ.. డ్రగ్స్, వాటి నష్టాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. టీనేజ్ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం కఠినచర్యలకు ఉపక్రమించిందన్నారు. డ్రగ్స్‌భూతాన్ని నివారించుటకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు.

ఘన్‌పూర్‌లో తల్లిపాల వారోత్సవాలు

డిచ్‌పల్లి, ఆగస్టు 1 : బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే ఆధారం, పుట్టిన బిడ్డ నుంచి ఆరునెలలపాటు ప్రత్యేకంగా తల్లిపాలు శిశువు ఎదుగుదలకు ఎంతో మేలు చేస్తాయని అంగన్‌వాడీ టీచర్ శారద అన్నారు. తల్లిపాల వారోత్సవాలపై గురువారం కేంద్రంలో గర్భిణులు, చిన్నారులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శిశువు ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో దోహదం చేస్తాయని తల్లిపాలే బిడ్డకు ప్రాణమన్నారు. తల్లి పాల వారోత్సవాలపై ఘన్‌పూర్ కేంద్రాన్ని ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి రమేశ్‌లు సందర్శించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయని సూపర్‌వైజర్ తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు

డిచ్‌పల్లి,ఆగస్టు 1: డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వెళ్తున్న 1డిపోకు చెం దిన ఆర్టీసీ బస్సు గురువారం మధ్యాహ్నం బస్సు ఆకస్మత్తుగా ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్సులో ఉన్న విద్యార్థులు, చిన్నారులు ఇక్కట్లు పడ్డారు. ప్రయాణికులు బస్సు నెట్టిన స్టార్ట్ కాక పోవడంతో ప్రయా ణికులు ఇబ్బందులు పడి ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

వేల్పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

వేల్పూర్, ఆగస్టు1: అసెంబ్లీలో మహిళ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యాలు చేశారని ఆరోపిస్తూ గురువారం వేల్పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలను సీఎం రేవంత్ రెడ్డి వెనక్కి తీసుకోవాలని, బేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

ఆపరేషన్ ముస్కాన్‌లో 46 మంది బాలకార్మికుల గుర్తింపు

కామారెడ్డి టౌన్, ఆగస్టు1 : ఆపరేషన్ ముస్కాన్‌లో 46 మంది బాల కార్మికులను గుర్తించినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. కామారెడ్డిలో 23 మంది, ఎల్లారెడ్డిలో 10, బాన్సువాడ 13 మందిని గుర్తించామని తెలిపారు. చిన్నపిల్లలు వెట్టిచాకిరికి గురికాకుండా వారి మొహంలో చిరునవ్వులు చిందించేలా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సూచించారు. ప్రజలు ఎవరైన బాల కార్మికులను పనిలో పెట్టుకున్నా.. వారితో బలవంతంగా పని చేయించినా.. ఒంటరిగా బాధపడుతున్న బాలలను చూసినప్పుడు, ఆశ్రయం అవసరమైన తప్పిపోయిన, వదిలివేయబడిన బాలలను చూసినప్పుడు, శారీరకంగా, మానసికంగా, లైంగిక దోపిడీకి గురవుతున్న బాలలను చూసినప్పుడు, హింసకు బెదిరింపులకు గురవుతున్న వీధి బాలలను చూసినప్పుడు 1098 లేదా డయల్ 100, 112కు సమాచారం అందించాలని సూచించారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించండి'



దోమకొండలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దోమకొండ, ఆగస్టు 1: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వడ్ల నర్సింహాచారి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డిలు హాజరై మాట్లాడారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో కార్యకర్తలు ప్రతి గ్రామం నుంచి వివిధ స్థానాలకు పోటీచేసి గెలుపొందాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, జగదీష్, అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి, అంజమ్మ, రవి, మనోజ్‌కుమార్, సిద్దరాములు, విఠల్‌రెడ్డి, పాల్‌రెడ్డి, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయి'

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 1 : ప్రభుత్వ ఉద్యోగి ఏ ప్రాంతంలో పని చేసిన అతను చేసిన సేవలు గుర్తింపునిస్తాయని వైద్యాధికారి రోహిత్ తెలిపారు. గురువారం పెద్దకొడప్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బదిలీపై వెళుతున్న పార్మాసిస్ట్ సంగమేశ్వర్ వీడ్కోలు సభకు హాజరై మాట్లాడారు. ఉద్యోగం చేస్తున్న వారు ఏ ప్రాంతంలో విధులు నిర్వహించాలనుకున్నా చక్కటి సేవలను అందిస్తే ఆ ప్రాంతవాసులకు చిరకాలంగా గుర్తుండిపోతారని తెలిపారు. ఈ సందర్భంగా పార్మాసిస్ట్ సంగమేశ్వర్‌తో పాటు, బదిలీపై వెళుతున్న సూపర్‌వైజర్, ఏఎన్‌ఎంలను పూలమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సంగమేశ్వర్ మాట్లాడుతూ తాను 11 ఏళ్ళపాటు ఆసుపత్రిలో సుదీర్ఘసేవలు అందించానని, ఉద్యోగ నిర్వహణలో సహకారం అందించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఉమాకాంత్, వెంకటస్వామి పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పార్మాసిస్ట్‌గా గురువారం అనిత బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనిత నిజాం సాగర్ మండలం నుంచి వచ్చారు.

మహిళపై హత్యాయత్నం.. కేసు నమోదు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 1 : పట్టణంలోని పీఎంహెచ్ కాలనీలో నివాసం ఉండే మహిళా హత్యకేసులో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా బాసర మండలం ఓని గ్రామానికి చెందిన కారండే ఉమా అలియాస్ దేవి బాయి(33) అనే మహిళ గత కొంతకాలంగా కామారెడ్డిలో నివాసం ఉంటుంది. 14 సంవత్సరాల కిందట అశోక్ అనే వ్యక్తితో వివాహం జరగగా ఆమెకు ముగ్గురు ఆడపిల్లలున్నారు. భార్యభర్తల మధ్య గొడవలు రాగా మూడు సంవత్సరాల క్రితం వారిద్దరు విడిపోయారు. దేవిబాయి తన పిల్లలను తీసుకుని అమ్మ గౌతికబాయి వద్ద ఉంచి తాను పనినిమిత్తం కామారెడ్డికి వచ్చింది. అయితే కామారెడ్డిలో అబ్బువార్ మాధవ్ అనే వ్యక్తితో కలిసి పీఎంహెచ్ కాలనీలో అద్దెఇంట్లో సహజీవనం చేస్తుంది. బుధవారం ఉదయం మాధవ్ ఆమెను కొట్టి మెడకు చున్నితో ఉరి బిగించి, గోడకు నెట్టివేసి చంపాడు. ఆ తర్వాత ఏమి తెలియనట్లుగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చాడు. విషయం తెలిసిన ఆమె తల్లి గౌతిక బాయి మాధవ్‌పై ఫిర్యాదుచేయగా హత్యకేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

ట్రెజరీ సహాయ సంచాలకుడు బదిలీ

కామారెడ్డిటౌన్, ఆగస్టు 1 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో కామారెడ్డి జిల్లా ట్రెజరీ శాఖ సహాయ సంచాలకుడు సాయిబాబా హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. దీంతో ట్రెజరీ ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీజీవో అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్, సాయిరెడ్డి, సురేష్, నర్సయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మహిళా కళాశాల ప్రిన్సిపాల్

సదాశివనగర్, ఆగస్టు 1 : మండలంలోని మర్కల్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శోభారాణి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు బాగుండే విధంగా విద్యాబోధనతో పాటు సత్ప్రవర్తన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ఉన్నతస్థానాలలో నిలిపేవిధంగా కృషిచేస్తామన్నారు. కళాశాల నుంచి ఇతర కళాశాలలకు బదిలీపై వెళ్తున్న 16 మంది అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయిని, అకాడమిక్ కో-ఆర్డినేటర్ వనజ, అధ్యాపకులు శ్రీలత, ఉజ్వాసుల్తానా, శ్రావణి, మీనా పాల్గొన్నారు.

దోమకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శంకర్

దోమకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా మహబుబ్‌నగర్ జిల్లా అమాన్ గల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి దోమకొండకు వచ్చారు. అలాగే రికార్డు అసిస్టెంట్‌లుగా ఆరిఫ్, మనోహర్‌పటేల్, శ్రీరాం బాధ్యతలు స్వీకరించారు. దోమకొండ కళాశాలకు వచ్చిన ఉద్యోగులను లెక్చరర్‌లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హలో బీసీ.. చలో అమృత్‌సర్ కరపత్రాల ఆవిష్కరణ

కామారెడ్డిరూరల్, ఆగస్టు 01 : హలో బీసీ.. చలో అమృత్‌సర్ కరపత్రాలను జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు మాట్లాడుతూ అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభ ఈనెల 7న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ పట్టణంలో నిర్వహించే మహాసభను విజయవంతం కోసం తెలుగు రాష్ట్రాల్లోని బీసీలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.సంతోష్, యోగేష్, అరవింద్, సాయి, విఘ్నేష్, శశికుమార్, రాజు, ధనరాజ్, ప్రమోద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘ నూతన కార్యవర్గం

దోమకొండ, ఆగస్టు 1: మండలంలోని గొట్టిముక్కుల గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఆ సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముదాం నారాయణ, ఉపాధ్యక్షుడిగా ఆకుల సిద్దరాములు, ప్రధాన కార్యదర్శిగా ముదాం సిద్దరాములు, కోశాధికారిగా ముదాం ఎల్లంలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా దేవిసింగ్ తండా రహదారి



బురదమయమైన రోడ్డు

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 1 : వారం రోజుల నుంచి మండలంలో కురుస్తున్న వర్షాలకు మారుమూల ప్రాంతాల్లోని రహదారులు అధ్వానంగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా మారుతున్నాయి. దీంతో మారుమూల ప్రాంతాల్లోని రహదారులలో ఉంటున్న ప్రజలు రాకపోకలు చేయడానికి తీవ్రఇబ్బందులు పడతున్నారు. మండలంలోని పెద్దదేవిసింగ్ తండా, కాటేపల్లి తండా కుబ్యానాయక్ తండాలలో గల రహదారులు బురదతో నిండి కాలినడకన ప్రయాణానికి కూడా అనువుగా లేవని తండావాసులు వాపోతున్నారు. తండాల నుంచి ఏదైనా అత్యవసర పనిమీద వెళ్దామని అనుకున్నా తండాలలో గల ప్రధాన రహదారులు బురదతో నిండి ఇబ్బందికరంగా మారాయని వాపోతు న్నారు. ప్రధానరహదారిపై నీరు నిలిచి బురదమయంగా మారడంతో వ్యాధులు ప్రబలడానికి ఆస్కారం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ముఖ్యంగా పెద్దదేవీసింగ్ తండాలో గల ప్రధాన రహదారి వాన నీటికి బురదతో నిండిపోవడంతో తండావాసులతో పాటు, పాఠశాలకు వెళ్లే చిన్నారులకు కష్టసాధ్యంగా మారిందని తెలిపారు. అధికారులు స్పందించి తండాలలో రహదారులపై నెలకొని ఉన్న బురదను తొలగించాలని కోరుతున్నారు.

పోచారం మనువడికి సీఎం అభినందన

- చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్స్ సాధించడంపై ప్రశంస

బాన్సువాడటౌన్ , ఆగస్టు 1 : మాజీస్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మనువడిని సీఎం అభినందించారు. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో ఎమ్మెల్యేలు, శాసన మండలి సభ్యులు హాజరయ్యారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డిలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అతిథులకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆసియాచెస్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలో రెండు గోల్డ్ మెడల్స్‌ను సాధించిన పోచారం మనుమడు, పోచారం భాస్కర్‌రెడ్డి కుమారుడు రుశాంక్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. అదేవిధంగా పురుషుల విభాగంలో సత్తా చాటిన తక్కెడపల్లి విజయరాఘవేంద్ర , మహిళల విభాగంలో 5 గోల్డ్ మెడల్స్ సాధించిన తక్కెడపల్లి ప్రతిభలను కూడా అభినందించారు.



పోచారం మనుమడిని అభినందిస్తున్న సీఎం

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన జుక్కల్ ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 1 : దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెల్లడించడంతో మంగళవారం జుక్క ల్‌ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు హైదరాబాద్ సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి కృత జ్ఞతలు తెలిపారు.

14 అడుగులకు చేరిన పోచారం నీటిమట్టం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 1 : పోచారం ప్రాజెక్టు నీటి మట్టం 14 అడుగులకు చేరుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణం గా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో ఆయ కట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో లింగంపేట, గుండా రం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుం డడంతో ప్రాజెక్టులోకి నీటిమట్టం పెరుగుతోంది. గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి 14 అడుగుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.867 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి గురువారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 1872 క్యూసెక్కులు వస్తున్నట్లు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఆగ్రహం

ఎల్లారెడ్డి, ఆగస్టు 1 : అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్‌కుమార్ మాటాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సాక్షాత్తు అసెంబ్లీలో తోటి శాసనసభ్యులు అందులో మహిళా సభ్యుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. సమావేశంలో ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింలు, మున్సిపల్ కౌన్సిల్‌సభ్యులు ఎరుకల సాయిలు నీలకంఠం, ఇమ్రాన్, సొసైటీ సభ్యులు దేవదాస్, బర్కత్‌ఖాన్, అరవింద్‌గౌడ్, నెల్లిగోపాల్, సాజిద్, నాగరాజు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్ : పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థానంలో ఉండి నిండు సభలో ఒక మహిళ అని చూడకుండా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీరును ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్‌చైర్మన్ కుంబాల రవియాదవ్, కౌన్సిలర్‌లు కృష్ణాజీరావు, నాయకులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై శాసనసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురు వారం మండలంలోని పద్మాజీవాడి ఎక్స్‌రోడ్ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ ఎస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్ రావు, శ్రీనివాస్‌నాయక్, సాయాగౌడ్, కుమ్మరి లింగం పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

బీర్కూర్, ఆగస్టు 1 : మండల కేంద్రానికి చెందిన ఉల్లెప్రవీణ్ కుమార్ అనే యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు సకాలంలో స్పందించి ప్రవీణ్‌ను కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్‌కు చెందిన ఉల్లె ప్రవీణ్ కుమార్ అనే యువకుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఫుల్లుగా మద్యం సేవించి ప్రవీణ్‌కుమార్ ఇంటికి చేరుకున్నాడు. తన తల్లి, భార్య, అమ్మమ్మతో గొడవపడ్డాడు. మద్యం మత్తులో అమ్మమ్మ, తల్లి, భార్యను చితకబాదాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బీర్కూర్ శివారులోని భాజన్ చెరువు వద్దకు చేరుకున్నాడు. జీవితంపై విరక్తి కలగడంతో ప్రవీణ్ చెరువు నీటిలో దూకాడు. కొద్ది దూరంలో ఉన్న వ్యక్తి ప్రవీణ్ చెరువులో దూకడాన్ని గమనించి తన ఫోన్ నుంచి 100 నెంబర్‌కు డయల్ చేశాడు. బీర్కూర్ పోలీసులు వెంటనే స్పందించి చెరువు వద్దకు చేరుకుని నీటిలో మునుగుతున్న ప్రవీణ్‌ను బయటకు తీసి రక్షించారు. అనంతరం పోలీసులు ప్రవీణ్‌ను అతడి ఇంటికి చేర్చారు.



బీర్కూర్ చెరువులో నుంచి ప్రవీణ్‌ను బయటకు తీసిన పోలీసులు

రైతుల రుణమాఫీ వివరాల పరిశీలన



రుణమాఫీ వివరాలను వివరిస్తున్న ఏఈవోలు

దోమకొండ, ఆగస్టు 1 : మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ఏఈవోలు శ్రీలత, కృష్ణారెడ్డి రైతు రుణమాఫీకి సంబంధించి వివరాలను రైతులకు తెలియజేశారు. ఆధార్‌కార్డు నంబర్‌తో రైతులకు సంబంధించిన రుణమాఫీ పథకం, రూ.లక్ష, రూ.లక్షా 50 వేల వరకు ప్రభుత్వం మాఫీచేసిన సందర్భంగా రైతులకు తమ రుణం ఏయే బ్యాంకుల్లో ఉందో, ఎంత రుణం మాఫీ అయిందనే వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఏవో పవన్ కుమార్ మాట్లాడుతూ రైతు రుణమాఫీకి సంబంధించి వివరాలను తెలుసుకోవడానికి రైతులు తమ ఆధార్‌కార్డు తీసకుని రైతువేదికల్లో అందుబాటులో ఉండే ఏఈవోలను సంప్రదించాలన్నారు. అలాగే రైతుబీమా పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి కొత్త పాస్‌బుక్‌లు వచ్చిన రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, పాస్‌బుక్, రైతుబీమా ఫారమ్‌తో పాటు అందుబాటులో ఉండే సెల్‌ఫోన్ నంబర్‌ను ఏఈవోలకు 5వ తేదీలోపు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సంగమేశ్వర్, దోమకొండ, గొట్టిముక్కుల, లింగుపల్లి, మాందాపూర్ గ్రామాలకు సంబంధించిన రైతులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

కామారెడ్డిటౌన్, ఆగస్టు 1 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. గురువారం అడ్లూర్‌లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ ప్రతి ఇంటికి ఒక మొక్కచొప్పున నాటి రేపటితరాలకు మంచి పర్యావరణాన్ని అందిద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌కమిషనర్ సుజాత, వార్డు కౌన్సిలర్ రవి, అన్వర్ షైమద్, సుల్తానా సలీం, పాత శివకృష్ణ మూర్తి, పిడుగు మమత, ఆకులరూప, రాణి పాల్గొన్నారు.



మొక్కలకు నీరు పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆసుపత్రిలో సిబ్బందిని నియమించాలని వినతి



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దోమకొండ, ఆగస్టు 1 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయించాలని గురువారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి దోమకొండ మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, డెంటిస్ట్, స్టాఫ్‌నర్సు, ఫార్మాసిస్టు, డ్రెస్సింగ్ సిబ్బంది బదిలీ కావడం వలన ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ దోమకొండ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, మాజీ విండో డైరెక్టర్ పందిరి మధుసుధన్‌రెడ్డి ఉన్నారు.

వడ్డెర సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ



వడ్డెర సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ

నసురుల్లాబాద్, ఆగస్టు 1 : ఆషాఢమాసంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బోనాల పండుగ సందర్భంగా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో గురువారం శివాజీనగర్ కాలనీవాసులు, వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పెద్ద పోశమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు, మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్ మాట్లాడుతూ ప్రతిఏడు ఒడ్డెర సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులందరూ పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండాలని దేవుడికి మొక్కుకున్నామన్నారు. అనంతరం శివాజీనగర్ కాలనీవాసులు, వడ్డెర సంఘం వారు ప్రతి ఇంటి నుంచి ఆడపడుచులు, పెద్దపోచమ్మ, అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని, అలాగే నైవేద్యం అమ్మవారికి పట్టు వస్త్రాలు, సమర్పిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం పెద్దలు, యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపుపై సమావేశం

బీర్కూర్, ఆగస్టు 1 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గత రెండురోజులుగా కాంప్లెక్స్ సమావేశాలు కొనసాగుతున్నాయి. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు మీటింగ్‌లో పాల్గొన్నారు. గురువారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో విద్యాశాఖ నోడల్ అధికారి వెంకన్న మాట్లాడారు. నవంబర్‌లో జరిగే జాతీయ సాధన పరీక్షకు విద్యార్థులను ఏ విధంగా సిద్ధం చేయాలి. విద్యాప్రమాణాలు ఎలా పెంపొందించాలి. కనీస అభ్యాసన సామర్థ్యాలు ఏ విధంగా అలవర్చాలో వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఆర్‌పీలు దుర్గాప్రసాద్, నాగరాజు, హాజీ, సాయికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీలను పరిశీలించిన మైన్స్ అధికారులు



ఇసుక క్వారీలను పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

బీర్కూర్, ఆగస్టు 1 : బీర్కూర్ శివారులోని మంజీరా నదిలో ఇసుక క్వారీలను గురువారం మైన్స్ అధికారులు నాగలక్ష్మీ, గంగాగౌడ్, సబార్డినేట్ రాజులు పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం క్వారీలను రద్దు చేసింది. కొంత మంది వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు మంజీరనదిని, క్వారీలను, స్టాక్‌యార్డులను పరిశీలించినట్లు తెలిపారు. రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబురాలు

బాన్సువాడటౌన్ , ఆగస్టు 01 : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సంబురాలు జరుపుకున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కూడా సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు గుడుగుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణకు కట్టుబడి ఉన్నారనడానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పాము కలకలం

- చిన్నారులకు తృటిలో తప్పిన ప్రమాదం



అంగన్‌వాడీ కేంద్రంలో పాము

బీర్కూర్, ఆగస్టు 1 : మండలంలోని బరంగేడ్గిలోని హనుమాన్ ఆలయ సమీపంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో కట్లపాము చొరబడింది. ఈ సంఘటన తీవ్ర కలకలం రేపింది. కేంద్రంలో పనిచేసే ఆయమ్మ గిర్మవ్వ సకాలంలో పాముని చూడటంతో చిన్నారులకు పెనుప్రమాదం తప్పింది. అంగన్‌వాడీ కేంద్రంలో పదిమంది చిన్నారులున్నారు. కేంద్రం పక్కన ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. మధ్యాహ్నం సమయంలో చిన్నారులు భోజనం చేసి నిద్రపోతున్నారు. సరిగ్గా అదే సమయంలో పొదల్లో నుంచి కిటికీ ద్వారా కట్లపాము లోపలికి ప్రవేశించింది. అదే సమయంలో ఆయమ్మ పిల్లల దగ్గరకు వచ్చి చూడగా పిల్లల మధ్య పాము కదలాడుతూ కనిపించింది. దీంతో ఆయమ్మ పెద్దపెట్టున కేకలు పెట్టింది. పక్కనే ఉన్న వారు అక్కడికి చేరుకుని మెల్లిగా పిల్లలను బయటకు తీసుకువచ్చారు. అనంతరం ఆయమ్మ కర్రతో పామును చంపేసింది.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	- ఓసీ
దర్శన్	- శివంభజే
ప్రియా 70	- కల్కి
ప్రియా 70	- రాయన్, బడ్డి

బాన్సువాడ	
మహేశ్వరి	- రాయన్
వెంకటేశ్వర	- శివం భజే

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

